క్లుప్తంగా

అంగన్‌వాడీలో ఆట-పాటలతో విద్య

– సీడీపీవో వి.సుజాతదేవి



ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాలతో విద్యను చిన్నారులకు అందించడం జరుగుతుందని సీడీపీవో వి.సుజాతదేవి అన్నారు. ప్రీప్రైమరీ-1, ప్రీ ప్రైమరీ-2 కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) డేను నిర్వహించారు. 0-6 సంవత్సరాలలోపు చిన్నారుల తల్లిదండ్రులను కేంద్రాలకు ఆహ్వానించారు. పిల్లల సమగ్రాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లులకు వివరించారు. పిల్లల మానసిక ఉల్లాసానికి ఇంటి వద్ద తీసుకోవలసిన చర్యలను తెలియజేశారు. ఆయా కార్యక్రమాలను సీడీపీవో పర్యవేక్షించారు.

బాల్య వివాహం చేయడం నేరం

ఎస్టీ కాలనీలో అడ్డుకున్న అధికారులు



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రంలోని ఎస్టీ కాలనీలో జరుగుతున్న బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. కాలనీకి చెందిన మైనర్ బాలుడికి, పాతమల్లాయపాలెం ఎస్టీ కాలనీకి చెందిన మేజర్ యువతికి వివాహం జరుగుతుందన్న సమాచారం ఐసీడీఎస్ అధికారులకు బుధవారం అందింది. దీంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీ రత్నం, చైల్డ్ రైట్స్ కమ్యూనిటీ రిసోర్స్ వర్కర్ రాజ్యలక్ష్మి, ఏఎస్ఐ శ్రీనివాసరావులు బాలుడి ఇంటికి వెళ్లారు. బాలుడి తండ్రి ఆవుల చెంచయ్య, తల్లి వీరమ్మలతో మాట్లాడారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని వివరించారు. బాలుడికి 21 సంవత్సరాలు వచ్చే వరకూ వివాహం చేయడానికి వీల్లేదని తెలిపారు. ఈమేరకు బాలుడి తల్లిదండ్రుల నుండి లిఖితపూర్వక స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వెంకటరత్నం మాట్లాడుతూ బాల్యవివాహానికి ఎవరు ప్రేరేపించినా శిక్షార్హులవుతారని తెలిపారు.

యూనిఫైడ్ సివిల్ కోడ్ ప్రయత్నాలు మానుకోవాలి



నెహ్రూనగర్: భారత పౌరుల్ని ప్రమాదంలో పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయ తలపెట్టిన యూసీసీ(యూనిఫైడ్ సివిల్ కోడ్) ప్రయత్నాల్ని మానుకోవాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు కోరారు. యూసీసీ అమలుకు వ్యతిరేకంగా అంకమ్మనగర్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మైనార్టీ మతాల్ని అణచివేస్తూ, దేశాన్ని ఆర్థికంగా కుంగదీసి, పరిపాలనలో విఫలమైన మోదీ కర్ణాటకలో ప్రజల దెబ్బను చవి చూశారని తెలిపారు. ఇప్పుడు యూసీసీ అంటూ దేశంలో వివిధ మతాలు కులాల మధ్య చిచ్చుపెట్టి అల్లర్లు సృష్టించేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. మణిపూర్‌లో లక్షలాదిమంది క్రైస్తవుల ఆస్తులు ధ్వంసం చేస్తూ ఉంటే మోదీ 50 రోజులుగా మౌనం పాటిస్తున్నారని ధ్వజమెత్తారు. అల్లర్లను అదుపు చేయకుండా క్రైస్తవ దేశాలకు వెళ్లి స్నేహాన్ని నటిస్తూ వచ్చారని ఆరోపించారు. యూసీసీ వద్దంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి లక్ష మంది క్రైస్తవ, ముస్లిం, బౌద్ధ జైన, మానవతావాదుల సంతకాలు సేకరించి భారత లా కమిషన్‌కు అందించనున్నట్లు తెలియజేశారు. ఈనెల 9న అన్ని చర్చిల వద్ద క్రైస్తవ సంఘాల చర్చి పాస్టర్ల సాయంతో యూసీసీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేయనున్నట్లు వెల్లడించారు. 14న క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో న్యూఢిల్లీలోని భారత లా కమిషన్ కార్యాలయంలోని ప్రతినిధులకు వినతి పత్రం అందజేస్తామని తెలిపారు .సమావేశంలో క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు, క్రైస్తవ సంఘ నాయకులు కందుల దీనమణిరాజు, మోపర్తి శ్రీను, ఆంద్రూస్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు సిరంజ్‌లు, మాస్కులు అందజేత

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. జీజీహెచ్ పిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ పద్మలత, డాక్టర్ మోహన్ చంద్ర, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ రమేష్‌కుమార్, డాక్టర్ వీరేశ్వరరావు, డాక్టర్ రవీంద్రనాయక్ బుధవారం సిరంజ్‌లు అందజేశారు. టీవీ చానల్ సిబ్బంది హరీష్, అశోక్‌కుమార్ మాస్కులు అందజేశారు.

వ్యర్థాలతో అనర్థం

- ఎక్కడపడితే అక్కడే ఆస్పత్రుల వ్యర్థాలు
- వ్యర్థాల తరలింపులో ప్రైవేట్ ఆస్పత్రుల నిర్లక్ష్యం
- నిబంధనలు బేఖాతర్ చేస్తూ ప్రజారోగ్యంతో పరిహాసం
- బయో వేస్టేజ్‌తో ప్రజలకు అంటు వ్యాధులు ప్రబలే అవకాశం



ఈదులపాలెం సమీపంలో డంపింగ్ యార్డుకు వెళ్లే దారిలో పడేస్తున్న ఆస్పత్రుల బయో వేస్టేజీ వ్యర్థాలు, సిరంజ్‌లు, సూదుల గోతాలు

ప్రత్తిపాడు: ప్రైవేట్ ఆస్పత్రులు ఆస్పత్రివ్యర్థాలు బయో మెడికల్ వేస్టేజ్ తరలింపులో తీవ్ర నిర్లక్ష్యాన్ని చాటుతున్నాయి. శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాలను తరలించకుండా, కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను ఉల్లంఘిస్తూ వ్యర్థాలను నల్ల గోతాల్లో కుక్కి, డంపింగ్ యార్డుల సమీపంలో, రోడ్ల వెంబడి పడేసి వెళ్లిపోతున్నారు. ప్రజారోగ్యాన్ని పరిహాసం చేస్తున్నారు.

అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ..

మండలంలో ఒకటి రెండు బడా కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు గ్రామాల్లో వైద్యమందించే ఆర్ఎంపీలు ఇరవై మందికి పైగానే ఉన్నారు. వీరంతా ఎవరిస్థాయిలో వారు ఓ మోస్తరు క్లినిక్‌లను నిర్వహిస్తున్నారు. వీరి వద్దకు నిత్యం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. జలుబు, జ్వరంతో పాటు ఇతరత్రా రోగాల బారిన పడి ఆయా ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి సూదిమందు తీసుకునే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఈనేపథ్యంలో రోగులకు వాడిన సూదులు, సిరంజులు ఇతరత్రా వ్యర్థాలను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం రెండు రోజుల్లో తరలించవలసి ఉంటుంది. కానీ అలా తరలించకుండా ఆస్పత్రి పరిసరాలు, గ్రామ శివార్లు, ఖాళీ ప్రదేశాలు, డంపింగ్ యార్డులకు వెళ్లేదారుల్లో పడేస్తున్నారు. ఇలా పడేయడం వలన వ్యర్థాల నుంచి దుర్వాసనతో పాటు బ్యాక్టీరియా, క్రిములు వ్యాపించే ప్రమాదాలుంటాయని వైద్యులు చెబుతున్నారు. ఈదులపాలెం సమీపంలోని డంపింగ్ యార్డుకు వెళ్లే దారిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఇదిగో ఇలా గోతాలకు గోతాల వ్యర్థాలను రోడ్డు పక్కన పడేస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం శాస్త్రీయ పద్ధతిలో వీటిని నిర్వీర్యం చేయాల్సి ఉంటుంది. అలా చేయకుండా ఇష్టారీతిన వైద్యానికి ఉపయోగించిన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో పడేయడం వలన ప్రజలు అంటురోగాల బారిన పడే అవకాశాలున్నాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

- ఆస్పత్రి చట్టం 1996 ప్రకారం వ్యర్థాలను వేరు చేసి నిర్దేశిత డబ్బాల్లో మాత్రమే వాటిని పడేయాల్సి ఉంటుంది.
- ఆస్పత్రుల్లో వ్యర్థాలను పడేసేందుకు నీలం, నలుపు, ఎరువు, పసుపు రంగు డస్ట్‌బిన్‌లను వినియోగించాలి.
- నీలం రంగు డబ్బాలో సీసాలు, నలుపు రంగు డబ్బాలో సూదులు, బ్లేడ్‌లు, ఎరువు రంగు డబ్బాలో ప్లాస్టిక్, ఇంజక్షన్లు, పసుపు రంగు డబ్బాల్లో మానవ శరీరానికి సంబంధించిన వ్యర్థాలు, కాటన్, దూది వంటి వాటిని వేయాలి.
- కొన్ని రకాల వ్యర్థాలను ఆస్పత్రి ప్రాంగణంలోనే గుంత తీసి అందులో తగలబెట్టాల్సి ఉంటుంది.
- కానీ ఏ ఆస్పత్రుల్లోనూ ఇటువంటి డబ్బాల వినియోగం కనిపించడంలేదు. అన్ని రకాల వ్యర్థాలను కలిపి ఒకే రకమైన డస్ట్‌బిన్‌లో పడేసి చేతులు దులిపేసుకుంటున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో పడేయకూడదు

బయో మెడికల్ వేస్టేజీని బహిరంగ ప్రదేశాలలో పడేయకూడదు. వారు శాస్త్రీయ పద్ధతుల్లో వాటిని నిర్వీర్యం చేసుకోవాలి. ఒక్కసారి ఆస్పత్రుల యాజమాన్యాలతో మాట్లాడతా. ఇక నుంచి అలా రోడ్ల వెంబడి బయో వేస్టేజీ పడేయకుండా చర్యలు తీసుకుంటాం.

–షేక్ కాజా, ఇన్‌చార్జి సెక్రటరీ

రేషన్ బియ్యం పట్టివేత



రావిపాటివారిపాలెం (ప్రత్తిపాడు): అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని రావిపాటివారిపాలెంలో జనావాసాల మధ్యలో ఒక చిన్న రేకుల షెడ్డులో గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారన్న సమాచారం మంగళవారం ఉదయం ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబుకు అందింది. దీంతో ఆయన సిబ్బందితో కలిసి షెడ్డు పై దాడి చేశారు. 13 తెల్ల గోతాల్లో నిల్వ చేసిన 6.40 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు రవాణాకు వినియోగిస్తున్న టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషనుకు తరలించారు. బియ్యం నిల్వ చేసిన ప్రత్తిపాడుకు చెందిన కుంభా కల్యాణ్ వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై సమాచారం అందించాలన్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

శరవేగంగా డ్రైయిన్ల అభివృద్ధి పనులు



చేబ్రోలు సినిమాహాలు వద్ద పూడిక తీత అనంతరం మురుగునీటి కాలువ



యాదవపాలెం సమీపంలో పిచ్చిమొక్కలు తొలగించిన అనంతరం డ్రైయిన్

చేబ్రోలు: గతంలో ఎన్నడూ లేని విధంగా చేబ్రోలు మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే డ్రైయిన్ల అభివృద్ధి పనులు శరవేగంగా జరగుతున్నాయి. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య ప్రత్యేక చొరవతో చేబ్రోలు పరిసర ప్రాంతాల్లో రైతులకు అవసరమైన డ్రెయిన్‌లలోని పిచ్చి మొక్కలు తొలగింపు, పూడికతీత పనులు పూర్తి స్థాయిలో జరగుతున్నాయి. టీడీపీ పరిపాలన కాలంలో వర్షాలు పడిన సమయంలో పొలాలు ముంపు బారిన పడేవి. దీని వలన రైతులు నష్టపోవలసి వచ్చేంది. రైతులు వరి సాగు ప్రారంభించినప్పటి నుంచి వర్షపు నీరు బయటకు పోయే డ్రెయిన్లు అభివృద్ధికి నోచుకోకపోవటంతో పంట మునిగి దెబ్బతినటంతో రైతులు నష్టపోవలసి వచ్చేంది. వర్షాకాలంలో పొలాలలో నీరు నిలిచి మురుగు బయటకు పోయే మార్గంలేక తీవ్రంగా నష్టపోతున్న విషయాన్నీ రైతులు పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య దృష్టికి తీసుకురావటంతో వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన అధికారులకు పాటికాల్వ, సినిమా హాలు పక్కన డ్రెయిన్, మంచినీటి చెరువు మార్గంలోని మూడు కాల్వలను పూడిక తీయించి అభివృద్ధి చేయటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీని వలన రానున్న ఖరీఫ్, రబీ సీజన్‌లో అధిక వర్షాలు కురిసినా, ముంపు బారిన పడకుండా రైతులకు మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు. రైతాంగ సంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్యకు స్థానిక రైతులు అభినందనలు తెలిపారు.

ఆర్‌బీకే సేవలపై డాక్యుమెంటరీ



డాక్యుమెంటరీ నిర్మాణం చేస్తున్న డాక్టర్ గురు చరణ్ బృందం

పెదకాకాని: రైతు భరోసా కేంద్రం ద్వారా అన్నదాతలకు అందిస్తున్న సేవలపై డాక్యుమెంటరీ చేసి ప్రభుత్వానికి అందించనున్నట్లు స్కాచ్ గ్రూప్ సంస్థ వైస్ చైర్మన్ డాక్టర్ గురు చరణ ధనుంజయ్ అన్నారు. మండల పరిధిలోని నంబూరు గ్రామ ఒకటవ సచివాలయం రైతు భరోసా కేంద్రాలను బుధవారం స్కాచ్ (ఓఇఏ) గ్రూప్ సంస్థ ప్రతినిధులు సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలపై రైతులతో సమావేశమయ్యారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నట్లు రైతులు తెలియజేశారు. అలానే రైతు భరోసా కేంద్రాల ద్వారా సున్నా వడ్డీ పంట రుణాలు, పంటల బీమా, ఇన్పుట్ సబ్సిడీ, గిట్టుబాటు ధరలకు పండించిన పంట కొనుగోలు వంటి ప్రయోజనాలు చేకూరుతున్నాయని రైతులు వివరించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా లాభసాటి వ్యవసాయం చేసే విధంగా రైతులకు అందిస్తున్న సేవలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా వారికి చేకూరుతున్న ప్రయోజనాలపై అధికారులతో సంస్థ ప్రతినిధులు చర్చించారు. ఈ సన్నివేశాలను వీడియో షూట్ చేసి ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కాచ్ సంస్థ ఎనలిస్ట్ శివం చౌదరి, పరిశోధనాధికారి క్రునాల్ రైనా, సినిమాటోగ్రాఫర్ పవన్ గుడే, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎం.విజయభారతి, ఎండీ ఏపీ సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్ బాబు, మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు బి.బాబురావు, అఖిల, త్రివేణి, హేమంత్, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఉత్తమ సేవలు

వేజండ్ల (చేబ్రోలు): రాష్ట్రంలో ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన రైతు భరోసా కేంద్రాలు అన్నదాతలకు అన్ని విధాల అండగా నిలుస్తున్నాయని జిల్లా వ్యవసాయశాఖాధికారి నున్నా వెంకటేశ్వర్లు తెలిపారు. చేబ్రోలు మండలం వేజండ్ల రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం స్కోచ్ అవార్డు బృందం పరిశీలించింది. ఆర్‌బీకేల్లో రైతులకు అందుతున్న సేవల గురించి డీఏవో వెంకటేశ్వర్లు స్కోచ్ బృందానికి వివరించారు. కియోస్క్ ద్వారా రైతులకు విత్తనం నాటిన దగ్గర నుంచి పంట విక్రయించుకునే వరకు అందిస్తున్న సేవలను తెలియజేశారు. ఎరువులు, పురుగుమందులు, ఈ క్రాప్, ప్రకృతి విపత్తుల సమయంలో నష్టపరిహారం, పంట కొనుగోలు తదితర అంశాల గురించి వారు తెలుసుకున్నారు. పొన్నూరు ఏడీఏ, ఎంపీడీవో బి.బాబురావు, ఏవో శ్రీనివాసనాయక్, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రం వద్ద డీఏవో నున్నా వెంకటేశ్వరరావుతో మాట్లాడుతున్న స్కోచ్ బృందం సభ్యుడు

మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం

ఎంఈవో-2 జి. లీలారాణి

ప్రత్తిపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవో-2 జి.లీలారాణి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని భవిత సెంటరుతో పాటు హెచ్ఈ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం అమలు, కోడిగుడ్లు స్టాక్, రిజిస్టర్లు నిర్వహణ, నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా లీలారాణి మాట్లాడుతూ ప్రత్యేక అవసాలు గల చిన్నారుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. గ్రామాల్లోని ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించి నమోదు చేయాలన్నారు. పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యాకానుక కిట్లు అందించాలని ఆదేశించారు.



ప్రత్తిపాడు హెచ్ఈ ప్రాథమిక పాఠశాలలో కోడిగుడ్లు పరిశీలిస్తున్న ఎంఈవో-2 జి. లీలారాణి

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



సంధ్య

గుంటూరు రూరల్: అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందిన సంఘటన బుధవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం మేడికొండూరు మండలం పేరేచర్ల తెల్లక్వారీ కాలనీకి చెందిన తమ్మిశెట్టి రామకోటి, దుర్గ దంపతులు స్థానికంగా క్వారీ పనులు చేసుకుని జీవిస్తుంటారు. వీరికి ఇరువురు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నాడు. రెండవ కుమార్తె సంధ్య (17) ఇంటర్ మొదటి సంవత్సరం వరకూ చదివి ప్రస్తుతం ఇంటివద్దనే ఉంటూ తల్లిదండ్రులతోపాటు అప్పుడప్పుడు క్వారీ పనులకు వెళుతూ ఉంటుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం కాలనీ సమీపంలోని క్వారీ వద్ద తీవ్రగాయాలతో శవమై పడి ఉందని స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలికి చేరుకుని విచారించగా మృతురాలు సంధ్య అని తెలిసింది. తల్లిదండ్రులు, స్థానికుల ఆరోపణల మేరకు యువతి మృతిపై అనుమానాలతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఘటనలో ప్రేమ వ్యవహారంలో వివాదాలు జరిగాయా? ఇంకా కుటుంబ సమస్యలా? ప్రేమ వైఫల్యమా? హత్య చేశారా? లేక ఆత్మహత్యకు పాల్పడిందా? ఏం జరిగిందనేది పోలీసుల విచారణ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

తక్కువ ఖర్చులో నానో ఎరువులు

ఇఫ్కో జనరల్ మేనేజర్

ప్రత్తిపాడు: తక్కువ ఖర్చులో నానో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు వీటిపై దృష్టి సారించాలని ఇఫ్కో జనరల్ మేనేజర్ ఎం. జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రంలో ప్రత్తిపాడు మ్యాక్స్ సొసైటీ ఆధ్వర్యంలో నానో ఎరువులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇఫ్కో జనరల్ మేనేజర్ ఎం .జగన్‌మోహన్ రెడ్డి హాజరయ్యారు. నానో ఉత్పత్తుల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. యూరియా, డీఏపీ బస్తాల స్థానంలో లిక్విడ్ రూపంలో నానో యూరియా, నానో డీఏపీ ఎరువులు బహిరంగ విఫణిలో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు నానో ఎరువులను వినియోగించాలని కోరారు. నానో ఎరువుల పిచికారీ సులభతరంగా ఉండేలా డ్రోన్లును కూడా రైతాంగానికి అందుబాటులో ఉంచనున్నట్లు జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. జీడీసీసీ బ్యాంకు ప్రత్తిపాడు బ్రాంచి మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలోనూ విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ లాభసాటిగా వ్యవసాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో శశిధర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



సందేహాలను నివృత్తి చేస్తున్న జగన్‌మోహన్ రెడ్డి

నిర్ణీత వేళలో సర్వే పూర్తి కావాలి

సర్వేయర్లకు ట్రైనీ డెప్యూటీ కలెక్టర్ల సూచన

పెదనందిపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టిన సమగ్ర భూ సర్వేను నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని ట్రైనీ డెప్యూటీ కలెక్టర్లు సాయిశ్రీ, వాణిలు సర్వేయర్లకు సూచించారు. బుధవారం సాయంత్రం పెదనందిపాడు వచ్చిన వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు రీ సర్వేకు సంబంధించిన సమస్యలున్న పక్షంలో వాటిని పరిష్కరించాలని ప్రజలకు మేలు చేయటానికే ప్రభుత్వం ఈ సర్వే మొదలుపెట్టిందని, ఈ విషయంలో ఎవరూ అశ్రద్ధ వహించరాదని స్పష్టం చేశారు. సర్వేయర్లందరికీ కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని, అనుకున్న సమయానికి ఈ సర్వేను పూర్తిచేయాలని అందుకు ప్రతి ఒక్కరి సహకారం తీసుకోవాలని వారి చెప్పారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సుభాని, సర్వే అధికారులు నాగేశ్వర్, సత్యనారాయణ, మండల సర్వేయర్ ప్రసాదు, వివిధ గ్రామాల సర్వేయర్లు, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రైనీ డెప్యూటీ కలెక్టర్లు సాయిశ్రీ, వాణిలు

రోటరీక్లబ్ అధ్యక్షుడిగా కోదండరామిరెడ్డి

పెదనందిపాడు: స్థానిక రోటరీక్లబ్ 2023-24 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రస్తుత అధ్యక్షుడు కె.జాన్‌విక్టర్‌పాల్ తెలిపారు. పెదనందిపాడు రోటరీక్లబ్ అధ్యక్షుడిగా యన్నం కొదండరామిరెడ్డి, కార్యదర్శిగా యెలిశెట్టి రమణయ్య, కోశాధికారిగా ఎన్‌వీఎస్ నాగేశ్వరరావు వివిధ విభాగాలకు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలియజేశారు.

లింక్ డాక్యుమెంట్ పోయినది

కట్టా పురుషోత్తమరావు S/o వెంకటకృష్ణారావు R/o డోర్‌నెంబరు 2-55, సుద్దపల్లి గ్రామం, చేబ్రోలు మండలం, గుంటూరు జిల్లా, అను నా స్వాధీనములో ఉన్నటువంటి డి.నెం. 332/1రు యస్-46సెంట్లు మింజుమలె 2బ్లాకు నందు ఇంటి లింకు దస్తావేజు నెంబరు **1624/1985** ది. 20-06-2023న ఆటోలో ప్రయాణం చేస్తుండగా దస్తావేజులు ఉన్న సంచి పోయినది. కావున ఎవ్వరికైన దొరికిన యెడల సెల్ నెంబరు 9347846637 కు ఫోన్ చేసి తెలుపగలరు


ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

పట్నంబజారు: ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా మెలగాలని ఆ విభాగ డీఎస్పీ బాలసుందరరావు చెప్పారు. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో బుధవారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఆటోడ్రైవర్లు, వాహనాల యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లంతా తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని తెలిపారు. లైసెన్సు లేని డ్రైవర్లకు ఆటోను అద్దెకు ఇస్తే ఉపేక్షించమని యజమానులకు చెప్పారు. ఆటోల్ని ఇష్టానుసారంగా రోడ్డుకు అడ్డంగా ఆపి ప్రయాణికుల్ని ఇబ్బందులకు గురి చేయరాదని ఆదేశించారు. కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. రోడ్లపై ర్యాష్ డ్రైవ్ చేస్తూ కొంత మంది ఆటోవాలాలు ప్రమాదకర ప్రయాణం చేస్తున్నారని, ఇకపై అలాంటి వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. నాజ్ సెంటర్ పరిధిలో డీమార్ట్ వద్ద నో పార్కింగ్ జోన్‌గా గుర్తించినట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతిక్రమించే వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఈస్ట్ ట్రాఫిక్ సీఐ నిసార్ బాషా, ఎస్ఐ హరిబాబు, సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ బాలసుందరరావు

ఈ నీళ్లు తాగేది ఎలా?



నడింపాలెంలో రక్షిత మంచినీటి పథకం పనితీరు దుస్థితికి అద్దం పట్టే చిత్రాలివి. చెరువు నీరు అడుగంటడం, ఫిల్టర్ బెడ్‌ల పనితీరు అంతంత మాత్రంగానే ఉండటం, మైక్రో ఫిల్టర్ ఉన్నప్పటికీ ఫలితం లేకపోవడంతో.. బుధవారం ఉదయం ఇదిగో గ్రామంలోనికి ఇలా పచ్చని అపరిశుభ్రమైన కలుషిత నీటిని సరఫరా చేశారు. అసలే వానాకాలం.. అందులోనూ ఇ లాంటి పచ్చని నీటిని వినియోగిస్తే ఇక ప్రజారోగ్యం ఏమవ్వాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని శుద్ధ జలం సరఫరా చేయాలని కోరుతున్నారు.